ప్రజాశక్తి

సోమవారం 28 ఏప్రిల్ 2025 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా





రాజధాని రైతుల్లో అయోమయం

మరో 44 వేల ఎకరాల సమీకరణపై మంత్రి వ్యాఖ్యలే కారణం



ప్రజాశక్తి - గుంటూరు ప్రతినిధి : రాజధాని నిర్మాణంలో భాగంగా మరో 44 వేల ఎకరాలను భూ సమీకరణ ద్వారా తీసుకుంటారనే ప్రచారంతో అమరావతి రైతుల్లో అయోమయం నెలకొంది. వేర్వేరు అవసరాలకు ఇంత భూమిని ప్రభుత్వం సమీకరిస్తుందన్న ప్రచారంతో రాజధాని వెలుపల ఉన్న మండలాల్లోని పలు గ్రామాల్లో లావాదేవీలు పెరుగుతున్నాయి. దీంతో రాజధాని గ్రామాల్లో భూములు కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. రాజధాని రైతులు ధరలు భారీగా పెంచడం వల్లే కొనుగోలుదారులు రావడం లేదని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం మరో 44 వేల ఎకరాల భూమిని సమీకరణ ద్వారా తీసుకుంటుందనే ప్రచారంతో రాజధాని పరిసర మండలాల్లోని అన్ని గ్రామాల్లో క్రయ విక్రయాలకు కొంత భూమ్ వచ్చింది. 2015 జనవరిలో ప్రారంభమైన భూ సమీకరణలో 37,941 ఎకరాలకుగాను 34,689 ఎకరాలను సిఆర్‌డిఎకు రైతులు అప్పగించారు. ఇంకా 3,252 ఎకరాలు ఇవ్వడానికి సుమారు వెయ్యి మంది రైతులు సుముఖత వ్యక్తం చేయలేదు. భూ సమీకరణలో తీసుకున్న 34,689 ఎకరాలతోపాటు ప్రభుత్వ భూములు మరో 17 వేల ఎకరాలు కూడా రాజధానికి వినియోగించుకునేందుకు సిఆర్‌డిఎ అధికారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మొత్తంగా 51 వేల ఎకరాలు రాజధానికి సిద్ధం చేశారు. ఇంత భూమి అందుబాటులో ఉన్నా అన్ని నిర్మాణాలకు వినియోగించగా, మిగిలేది కేవలం 5 వేల ఎకరాలనేని మంత్రి నారాయణ చెబుతున్నారు. తాజాగా రాజధానిలో అంతర్జాతీయ విమానాశ్రయం, కొత్త రైల్వే లైను, మెట్రోరైలు నిర్మాణం, అవుటర్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ - అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే తదితర ప్రాజెక్టులకు భారీగా భూమి అవసరం ఉందని, అందువల్ల రాజధాని పరిసర మండలాల్లో భూ సమీకరణ-2ను ప్రారంభిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. దీనిలో భాగంగా ఇప్పటికే బౌద్ధారామం అమరావతిలో అభిప్రాయ సేకరణ ప్రారంభించారు. గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ప్రధాన మంత్రి మోడీ పర్యటన తర్వాత మే మొదటి వారంలో గ్రామ సభలను ముమ్మరంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈనేపథ్యంలో రాజధానిలోని 26 గ్రామాల్లో రైతుల నుంచి భూములు తీసుకున్న సిఆర్‌డిఎ మూడేళ్లలో అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగిస్తామని హామీ ఇచ్చింది. కానీ వేర్వేరు కారణాలతో హామీని అమలు చేయలేదు. ఇప్పటికి పదేళ్లయింది. రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఎప్పటికి అప్పగిస్తారన్నదీ ఇప్పటికీ అయోమయంగానే ఉంది. ప్రస్తుతం రాజధాని రైతులకు కేటాయించిన భూముల అభివృద్ధికి టెండర్లు పిలిచారు. ఏడాదిలో ఈ పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు తమ భూములను సమీకరణ ద్వారానే ఇతరులకు విక్రయించుకున్నారు. సుమారు 6 వేల ఎకరాలు చేతులు మారినట్లు సమాచారం. ఈనేపథ్యంలో రాజధాని ప్రాంతంలో భవనాల నిర్మాణం పూర్తయి తమ ప్లాట్లుకు మంచి ధరలు వచ్చి లబ్ధిపొందుదామని అనుకుంటున్న రైతులకు అదనపు భూ సమీకరణ అంశం మింగుడు పడటం లేదు. మళ్లీ 44 వేల ఎకరాలు తీసుకుంటే భూములను ఎప్పటికీ అభివృద్ధి చేస్తారని ఇప్పటికే సమీకరణలో భూములు ఇచ్చిన రైతులు ప్రశ్నిస్తున్నారు. అంత ఆర్థిక స్థోమత ప్రభుత్వం వద్ద ఉందా అన్న అంశం చర్చనీయాంశంగా మారింది. 44 వేల ఎకరాలను సమీకరణ ద్వారా మళ్లీ తీసుకుంటారని వస్తున్న వార్తల నేపథ్యంలో రాజధాని రైతుల్లో అంతర్గతంగా అలజడి ప్రారంభమైంది. రాజధాని పరిసర గ్రామాల్లోని అమరావతి మండలంలో మరో పది వేల ఎకరాలను తొలి విడతలో సమీకరించుకునేందుకు ఆయా గ్రామాల్లో గత వారం రోజులుగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. మూడు గ్రామాల సభల్లో భూములు ఇచ్చేందుకు సిద్ధమే అంటూనే పలు సమస్యలను ప్రభుత్వం ముందుంచారు. అమరావతి మండలం వైకుంఠపురం, యండ్రాయి, పెదమద్దూరు, కర్లపూడి గ్రామాల్లో భూములిచ్చేందుకు ముందుకు వచ్చిన రైతులు పలు అంశాలను అధికారులతో చర్చించారు. భూసేకరణ విధానంలో భూములిస్తే రైతులు నష్టపోతారని, భూ సమీకరణ విధానంలో పొలాలు అప్పగిస్తే మేలు జరుగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గ్రామ కంఠం నుండి 500 మీటర్ల వెలుపలనే భూ సమీకరణ చేయాలన్నారు. రోడ్డు వెంట భూములు అధిక విలువైనవని, వాటికి రాజధానిలో ఇచ్చిన జరీబు భూముల ప్యాకేజి ఇవ్వాలని కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో పరిసర గ్రామాల్లో క్రయ విక్రయాలు పెరిగితే రాజధాని గ్రామాల్లో భూముల ధరలు తగ్గుతాయని ఆందోళన లేకపోలేదు. అంతేగాక డిమాండ్ కూడా పడిపోతుందని భావిస్తున్నారు.

ఘనంగా నృత్య దినోత్సవం

'దృశ్య వేదిక' ఆధ్వర్యాన సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - విజయవాడ : 'దృశ్య వేదిక' సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విజయవాడలోని శ్రీ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో అంతర్జాతీయ నత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 70 మంది నర్తకులు ప్రేక్షకులను విశేషంగా అలరించారు. గోనుగుంట శైలశ్రీ, పద్మశ్రీ హేమంత్, డాక్టర్ సి. ఉషామాధవి, డాక్టర్ సీహెచ్. అజయ్ కుమార్, ఎ.సంతోష్, యల్లాజోస్యుల అనూరాధ, హెచ్. లేఖ్య భారణి, సి.సిరి వంటి ప్రముఖ గురువుల నేతత్వంలో శాస్త్రీయ, కూచిపూడి, జానపద నత్యాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా కూచిపూడి సీనియర్ నాట్యాచార్యులు వేదాంతం పాండురంగ శర్మ, కూచిపూడి యువ నర్తకి గోనుగుంట (మిగతా 2లో)



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి స్వాగతం

ప్రజాశక్తి - గన్నవరం : రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు విజయవాడ వస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి ఆదివారం గన్నవరం విమానాశ్రయంలో బిజెపి నేతలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పాతూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



పార్కుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

- 15వ ఆర్థిక సంఘం, విఎంసి సాధారణ నిధుల నుండి రూ.40 కోట్లు కేటాయింపు
- రూ.60 లక్షలతో ప్రధాన రహదారుల వెంట గోడలకు పెయింటింగ్స్
- 10 ఎకరాల్లో ఐకానిక్ పార్క్ అభివృద్ధి
- రూ.10 కోట్లతో కాల్వగట్ల సుందరీకరణ పనులు
- ప్రజాశక్తితో ప్రాజెక్టు డివిజన్-3 ఇఇ చంద్రశేఖర్

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ నగరవ్యాప్తంగా ఉన్న పార్కులను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రాజెక్టు డివిజన్-3 ఇన్చార్జి ఇఇ టి.చంద్రశేఖర్ చెప్పారు. పార్కుల్లో గ్రీనరీతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ రకాలు పనులు చేపట్టినట్లు చెప్పారు. విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు చీఫ్ ఇంజినీర్, ఎస్ఇల పర్యవేక్షణలో పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. నగర సుందరీకరణ (బ్యూటిఫికేషన్)లో భాగంగా నగరంలో గుండా వెళ్లే బందరు, ఏలూరు, రైవస్ కాల్వల గట్ల పటిష్టత, గ్రీనరీ, సుందరీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. పార్కుల్లో వివిధ రకాల పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పార్కుల అభివృద్ధి, కాల్వ గట్ల సుందరీకరణకు 15వ ఆర్థక సంఘం, విఎంసి సాధారణ నిధుల నుండి రూ.40 కోట్లు వెచ్చిస్తున్నట్లు చంద్రశేఖర్ వివరించారు. నగర వ్యాప్తంగా 160 పార్కులు ఉన్నాయని, మరికొన్ని ప్రాంతాల్లో స్థానిక డిమాండ్ ఆధారంగా కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు. పార్కుల్లో పిల్లలు, పెద్దలు ఆడుకునేందుకు ప్లే ఎక్యుప్‌మెంట్స్ (ఆటపరికరాలు) ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. నగర వ్యాప్తంగా ఉన్న పార్కుల్లో చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులపై ఇన్చార్జి ఇఇ చంద్రశేఖర్ ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.





ప్రశ్న : పార్కుల అభివృద్ధికి నగరపాలక సంస్థ తీసుకుంటున్న చర్యలేమిటి ?

ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు పార్కులను అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. పార్కులు, కాల్వ గట్ల సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. రకరకాల మొక్కలు, ఇతర గ్రీనరీ అభివృద్ధితోపాటు చుట్టు ప్రహరీగోడలు, మంచినీరు, మరుగుదొడ్లు, ప్లే ఎక్యుప్‌మెంట్స్ జిమ్ ఐటమ్స్, బెంచీలు, సేఫ్‌గార్డ్స్, పెయింటింగ్స్, రకరకాల పిల్లల ఆట వస్తువుల ఏర్పాటు వంటి చర్యలను తీసుకుంటున్నాము.

ప్రశ్న : విఎంసి పరిధిలో కమర్షియల్ పార్కులు ఎన్ని ఉన్నాయి? వాటి నిర్వహణ ఎలా ఉంది?

నగర పరిధిలోని రాజీవ్‌గాంధీపార్కు, కె.ఎల్‌రావు పార్కు, రాఘవయ్యపార్కు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పార్కుల్లో ప్రవేశ రుసుం వసూలు చేస్తున్నాం. వీటిల్లో కూడా మౌలిక సదుపాయాలు, గ్రీనరీ, మొక్కల పెంపకం తదితర పనులను ఇంకా చేయాల్సి ఉంది. ఇటీవలే తూర్పు నియోజకవర్గంలోని అక్కినేని పూర్ణచంద్రరావు పార్కును రూ.44 లక్షలతో అభివృద్ధి చేశాం.

ప్రశ్న: నగర సుందరీకరణలో భాగంగా ప్రధాన రహదారుల వెంట ఉన్న గోడలకు వేస్తున్న పెయింటింగ్స్‌కు ఎంత వెచ్చిస్తున్నారు?

నగర ప్రజలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణీకులు, పర్యాటకుల దృష్టి ప్రత్యేకంగా నగరంపై పడేలా ప్రధాన రహదారుల వెంట ఉన్న (మిగతా 2లో)



యువకుడికి గిన్నిస్ రికార్డ్స్‌లో చోటు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన వల్లభాపురం రామయ్య కుమారుడు ఎనోష్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. 2024 డిసెంబర్ 1న హాలెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రపంచ స్థాయి సంగీత కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 18 దేశాలకు చెందిన 1046 కీబోర్డ్ ప్లేయర్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఎనోష్‌కు ఈ నెల 25న విజయవాడ గుణదలలోని మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో ధృవపత్రాలను అందజేశారు.

ఉగ్రదాడిపై నిరసన

ప్రజాశక్తి - విజయవాడ

ఉగ్రదాడిని భారత ప్రజాస్వామ్యంపై దాడిగా భావిస్తూ ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలని ఎఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల భార్గవ్, లంకా గోవింద రాజులు అన్నారు. ఆదివారం సాయంత్రం హనుమాన్ పేటలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యాన పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.



ఒబిసి కుల గణన చేపట్టాలని వినతి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

దేశ వ్యాప్తంగా జనగణనతోపాటు ఒబిసి కులగణన జరపాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమం సంఘం అధ్యక్షుడు కేసిన శంకర రావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యాన ఆదివారం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద గల మహత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలను అందచేశారు. దేశవ్యాప్తంగా జనగణనతోపాటు ఓబీసీ కుల కులగణన జరపాలని ఆ వినతి పత్రంలో కోరామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, ఎన్‌టిఆర్ జిల్లా ఇన్చార్జి మేకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల భయంతో భవనంపై నుండి దూకిన వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - విజయవాడ

క్రైమ్ పోలీసులు వచ్చారన్న భయంతో విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో మండపేటకు చెందిన రాయుడు దుర్గారావు అనే వ్యక్తి మూడంతస్తుల భవనంపై నుంచి దూకేసినట్లు తెలిసింది. స్థానికుల కథనం ప్రకారం... భార్యతో కలిసి ఉన్న రాయుడు దుర్గారావు వద్దకు ఆదివారం మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు వచ్చారు. వారిని ఇంటి యజమానులు ప్రశ్నించారు. క్రైమ్ పోలీసులని చెప్పారు. ఐడి కార్డు చూపాలని ఇంటి యజమానులు కోరారు. ఇంతలోనే వారు ముగ్గురూ మూడంతస్తుల భవనంపైకి వెళ్లి రాయుడు దుర్గారావు భార్యను కిందకు తీసుకొచ్చారు. ముగ్గురు వ్యక్తులు మఫ్టీ డ్రెస్లో వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంతలోనే తప్పించుకునే ప్రయత్నంలో రాయుడు దుర్గారావు మూడంతస్తుల భవనం పైనుంచి దూకేశాడు. తీవ్రంగా గాయపడిన దుర్గారావును అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు పాత నేరస్తుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

నేడు వినతుల స్వీకరణ : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ

నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

నేడు 'మీట్ విత్ స్టేక్ హోల్డర్స్'

ప్రజాశక్తి - విజయవాడ

రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో డిఫెన్స్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ పాలసీ, క్లస్టర్ల రూపకల్పనకు ఏర్పాటు చేసిన మీట్ విత్ స్టేక్ హోల్డర్స్ కార్యక్రమానికి హాజరుకావాలని స్టేక్ హోలర్స్‌కు లేఖ రాసినట్లు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. పాలసీ రూపకల్పనలో కీలక భాగస్వాములు కావాలని కోరినట్లు ఎంపి తెలిపారు. హబ్ అభివద్ధి చేసేందుకు వాటాదారుల అనుభవం, ఆలోచనలు తెలియజేసేందుకు సోమవారం విజయవాడలోని హోటల్ వివంతలో మీట్ విత్ స్టేక్ హోల్డర్స్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కీలకమైన డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ సంస్థలు, ఇతర భాగస్వాములు పాల్గొంటారని తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - విజయవాడ

అజిత్ సింగ్‌నగర్ సెక్షన్ పరిధిలో సోమవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కార్యనిర్వాహక ఇంజినీరు పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అజిత్ సింగ్ నగర్ సబ్ స్టేషను 11 కెవి కనకదుర్గ నగర్ ఫీడరు పరిధిలోని విద్యుత్ లైన్ల వార్షిక తనిఖీ, మరమ్మతుల నిమిత్తం పి అండ్‌టి కాలనీ, నుకాలమ్మ గుడి, సెయింట్ ఆన్స్ స్కూల్ రోడ్, స్మైల్ హాస్పిటల్ రోడ్, ఆంధ్రపత్రిక కాలనీ, వశిష్ఠ కాలనీ, ఆంధ్రప్రభ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రోన్ కెమెరాలతో నిందితుల గుర్తింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా వ్యాప్తంగా డ్రోన్ కెమెరాలతో నేరాల నియంత్రణకు పోలీసులు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. పోలీసుల ఎవరూ చూడరు కదా, గ్రామానికి, పట్టణానికి దూరంగా నిర్మానుష్య ప్రదేశంలో ఉన్నాం కదాని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరిస్తున్నారు. కదలికలన్నీ నిరంతరం డ్రోన్ కెమెరా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఏ ప్రదేశంలో అయితే నేరాలు జరిగేందుకు అవకాశం ఉంటుందో ఆ ప్రదేశాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలతో ఆకతాయిల ఆట కట్టిస్తోంది కష్ణా జిల్లా పోలీస్ యంత్రాంగం. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలతో నిఘాను పటిష్టం చేసి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడుతున్నారు. పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో జుజ్జవరం గ్రామ శివారులో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్నారని గుర్తించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై పామర్రు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.

మొదటిపేజీ తరువాయి



ఘనంగా నృత్య దినోత్సవం

సత్యానందినిలను దశ్య వేదిక అధ్యక్షుడు హెచ్ వి ఆర్ ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో సత్కరించారు. ముఖ్య అతిథిగా హ్యాపీ రిసార్ట్స్ అండ్ రిక్రియేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అంబటి మధుమోహన్ కృష్ణ విచ్చేశారు. సంస్థ బాధ్యులు దొంతాల ప్రకాష్, డాక్టర్ హిమసాగర చంద్రమూర్తి, ఎన్ ఎస్ ఆర్ మూర్తి, బొర్ర నరేన్, కత్తి శ్యామ్ ప్రసాద్, ఈవన రమేష్ బాబు, డీవీ చంద్ర శేఖర్, ఈవన భాగ్యరాజ్, ఈవీ సాగర్, బాయన శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బత్తుల రూపాశ్రీ నడిపించారు.

పార్కుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

గోడలు, వివిధ నిర్మాణాలకు వివిధ రకాల ఆకృతుల్లో ఆలోచింప చేసే రీతిలో విలువైన, అత్యంత సుందరంగా బొమ్మల పెయింటింగ్స్ వేయిస్తున్నాం. వీటికి సుమారు రూ.60 లక్షల వరకు ఖర్చవుతోంది. స్థానిక డిఎల్ ఇన్‌ఫ్రా ప్రయివేటు సంస్థ ఈ పెయింటింగ్స్‌ను వేయడానికి కాంట్రాక్ట్ తీసుకుంది. బందర్ రోడ్డు, ఏలూరు రోడ్డు, బిఆర్‌టిఎస్ రోడ్డు, ఇలా నగరంలోని 25 ప్రధాన రహదారుల వెంబడి గోడలకు పెయింటింగ్స్ వేయిస్తున్నాము.

ప్రశ్న : కళావిహీనంగా ఉన్న పలు జంక్షన్ల అభివృద్ధికి ఎంత కేటాయింపులు జరిగాయి ?

ఆయా ప్రాంతాల్లోని ముఖ్య కూడళ్ల (జంక్షన్లు) అభివృద్ధికి నిధులు కేటాయింపులు జరిగాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది. మొగల్రాజపురం పాలీక్లీనిక్ రోడ్డులోని మధర్‌థెరిస్సా జంక్షకు రూ.10 లక్షలు, రెడ్‌స్కేర్‌కు రూ.10 లక్షలు, పటమట ఎన్‌టిఆర్ సర్కిల్‌కు రూ.20 లక్షలు, సితారా జంక్షన్‌కు రూ.50 లక్షలు నిధులు కేటాయించాము. చుట్టూ గ్రానైట్, స్టెయిన్‌లెస్‌స్టీల్ పైపులతో రెయిలింగ్, గ్రీనరీతో జంక్షన్లను అందంగా తీర్చిదిద్దుతున్నాము.

ప్రశ్న : డివైడర్ల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి ?

ఇప్పటికే నగర పరిధిలోని ప్రధాన డివైడర్లను గుర్తించి గ్రీనరీ, మొక్కలు పెంపకానికి చర్యలు తీసుకుంటున్నాము. వీటికి అంచనాలు తయారు చేసి, అభివృద్ధి చేస్తాం. ప్రధానంగా ప్రస్తుతం విశాలాంధ్ర రోడ్డుకు డివైడర్ ఏర్పాటు చేసి, గ్రీనరీ ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి రూ. 20 లక్షలు ఖర్చవుతుందని అంచనా.

ప్రశ్న : నగర పరిధిలో కాల్వగట్ల సుందరీకరణ పనులు ఏ స్థాయిలో ఉన్నాయి ? వాటికి నిధుల కేటాయింపు ఎంత జరిగింది?

నగర పరిధిలో గుండా ప్రవహిస్తున్న బందర్, ఏలూరు, రైవస్ కాల్వల గట్లను పటిష్టం చేయాల్సి ఉంది. కాల్వగట్లను విస్తరించి వాకింగ్ ట్రాక్‌తోపాటు గట్లపై గ్రీనరీని అబివృద్ధి చేయాల్సి ఉంది. కాల్వ గట్ల సుందరీకరణకు రూ.10 కోట్లు వెచ్చిస్తున్నాము. ప్రస్తుతం ఫైర్‌స్టేషన్ వద్ద ఉన్న బందరు కాల్వ సుందరీకరణ పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న : సింగ్‌నగర్ 'ఐకానిక్' పార్కు పనులు ఎంత వరకు వచ్చాయి? నిధుల పరిస్థితి ఏమిటి?

పదెకరాల విస్తీర్ణంలో ఈ పార్కు ఏర్పాటవుతోంది. రూ.2 కోట్లకుపైగా నిధులు ఖర్చు చేసి గ్రీనరీ, ప్లే ఎక్విప్‌మెంట్స్ ఏర్పాటు, మట్టితో చదును చేయడం వంటి అభివృద్ధి పనులు జరిగాయి. ఇంకా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి మరో రూ.3 కోట్లకు పైగా నిధులు అవసరం అవుతాయి. ఈ నిధుల మంజూరకు అధికారుల నుంచి అనుమతి తీసుకుంటున్నాం. పార్కులు, డివైడర్లు, జంక్షన్లు, కాల్వ గట్ల సుందరీకరణకు అధ్యధికంగా విఎంసి సాధారణ నిధులను కేటాయించాం.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - విజయవాడ

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతోపాటు జోనల్ కార్యాలయాల్లో కూడా ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 వరకు జరుగుతుందని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను అధికారులకు అందించవచ్చని తెలిపారు.

లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : దేశ కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారులకు, యాజమాన్యానికి కట్టు బానిసలు చేసే విధంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక,కర్షక,ప్రజా, వ్యతిరేక విధానాల వ్యతిరేకంగా 10 కేంద్ర కార్మిక సంఘాలు మే 20 వ తేదీన చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని పిలుపులో భాగంగా కార్మిక,కర్షక ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వ ర్యంలో ఆదివారం సాయంత్రం బుట్టాయిపేట జ్యోతిబా పూలే విజ్ఞాన కేంద్రంలో కార్మిక సంఘాల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం 26,000 వేతనం అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. ఏఐటియుసి జిల్లా నాయకులు లింగం ఫిలిప్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారికి వెల్ఫేర్ బోర్డుని అమలు చేయాలని, ఎనిమిది గంటల పని విధానం కార్మికులకు కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. పోస్టల్ ఉద్యోగుల సంఘం డివిజన్ కార్యదర్శి కె.వి. రావు మాట్లాడుతూ కేంద్రంలో ఎనిమిదవ వేతన సంఘాన్ని రాష్ట్రంలో 12వ వేతన సంఘాన్ని నియమించాలని, ఫిక్స్ టర్మ్ ఎంప్లాయ్మెంట్ ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రమాదేవి మాట్లాడుతూ అంగన్వాడి ఆశ మధ్యాహ్నం,భోజనం, ఆర్పి వంటి స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సుప్రీంకోర్టు తీర్పకారం గ్రాడ్యుటి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్లెం వెంకటేశ్వరరావు అధ్యక్షతవహించిన ఈకార్యక్రమంలో మచిలీపట్నం రిసోర్స్ పర్సన్స్ మెప్మా ఆర్పీల సంఘం జిల్లా నాయకులు కే మాధవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరీ సెట్ నాగేశ్వరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణ, సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ నాయకులు ఓఎల్ రావు, వై ఈశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం పోలినాయుడు, ఆర్ సి పి రెడ్డి పాల్గొన్నారు.

దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు : ఎస్‌పి



ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : దొంగతనాలను జరగకుండా వేసవిలో ముందస్తు జాగ్రత్త తీసుకుని మన ఇంటిని భద్రంగా ఉంచుకుందాం అని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడే వారి ఆటలు కట్టించేందుకు నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేశామన్నారు. వేసవి సెలవుల సందర్భంగా ఇళ్లకు తాళం వేసుకుని ఊరికి వెళ్లే వారు స్థానిక పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. తద్వారా రాత్రి, పగలు గస్తీ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది మీ ఇంటి చుట్టుపక్కల ప్రాంతంలో నిఘాను ఏర్పాటు చేస్తారన్నారు. ఇంటి ప్రధాన , వెనుక ద్వారాలకు తాళాలు, చుట్టూ ఉన్న కిటికీలకు టవర్ బోల్ట్ లు వేయాలన్నారు. ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలు కనబడేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, మరి ముఖ్యంగా అలారం వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. మీ నివాస ప్రాంతాల చుట్టుపక్కల అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనబడితే వెంటనే సమీప పోలీస్ వారికి సమాచారం అందించాలన్నారు.



డా.మాగంటిని సత్కరిస్తున్న ఆర్ఎంపిలు

డాక్టర్ మాగంటి శ్రీనివాసుకు సత్కారం

ప్రజాశక్తి - గుడివాడ : ఐఎంఎ గుడివాడ శాఖ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ మాగంటి శ్రీనివాసును ఆదివారం ఆయన స్వగహంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఐఎంఎ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిధికి లోబడి గ్రామీణ వైద్యులు ప్రాథమిక వైద్యం అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం గౌరవ సలహాదారు ప్రసాదరావు, బి.హెచ్.ఎం.పి.ఏ రాష్ట్ర నాయకులు నందూరి ఉమా శంకర్, కోలా వెంకటేశ్వరరావు, బిహెచ్ఎంపిఏ ఉమ్మడి కష్ణా జిల్లా అధ్యక్షులు సాగిరాజు ఉదయభాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

సంగీత ప్రదర్శనలో గిన్నిస్ వరల్డ్ రికార్డు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరానికి చెందిన పి. కిషోర్, సుజాత దంపతుల కొడుకు మేధాన్ష్, కుమార్తె మనోజ్ఞ రోజలిండ ఆన్లైన్ బంధ సంగీత ప్రదర్శనలో మ్యూజికల్ కీబోర్డ్ వాయిద్యంతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. హలేల్ మ్యూజిక్ స్కూల్ ఆగస్టిన్ దండంగి శిక్షణ సారథ్యంలో 18 దేశాల నుండి 1046 మంది కీబోర్డ్ వాయిస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్లో స్థానం దక్కించుకున్నారు. ప్రపంచ రికార్డు నెలకొల్పిన మేధాన్ష్, మనోజ్ఞ రోజలిండ ను గిన్నిస్ ప్రతినిధులు ఆగస్టిన్ సత్కరించారు.



రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రైల్వే స్టేషన్‌లో ఆదివారం గుడివాడ రైల్వే పోలీసులు, గుడివాడ లా అండ్ ఆర్డర్ పోలీసులు మచిలీపట్నం నుండి వచ్చిన బాంబ్ డిక్టేటింగ్ పార్టీతో కలిసి ప్రత్యేకంగా తనిఖీలు చేశారు. రైలుబండ్లలో జరుగుతున్న దొంగతనాలు పట్ల ప్రజలకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రోన్ కెమెరాలతో గుడివాడ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. గుడివాడ రైల్వే ఎస్ఐ మహబూబ్ షరీఫ్ మాట్లాడుతూ రైలుబండ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కష్ణాజిల్లా లా అండ్ ఆర్డర్ పోలీస్‌తో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించామన్నారు. గుడివాడ టూ టౌన్ సిఐ నాగ ప్రసాద్, రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షరీఫ్, గుడివాడ రైల్వే స్టేషన్ స్టేషన్ మాస్టర్, గుడివాడ కమర్షియల్ ఇన్స్పెక్టర్ భగవాన్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



శ్యామ్‌కిషోర్‌ను పరామర్శిస్తున్న రాయపూడి

శ్యామ్ కిషోర్‌కు పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల అనారోగ్యానికి గురై వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు ను జనసేన ఉభయ జిల్లాల అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ పరామర్శించారు. ఆదివారం రాయపూడి శ్యామ్ కిషోర్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. శ్యామ్ కిషోర్ నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజలకు అండగా నిలిచారని ప్రశంసించారు. నియోజకవర్గంలో రాజకీ యా లకు అతీతంగా సేవా భావంతో అందరి మనసులో నిలిచిన వ్యక్తి శ్యామ్ కిషోర్ నాయుడు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు రాయపూడి తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక మార్కెట్ సెంటర్‌లో ఆదివారం శ్రీ రాజరాజేశ్వరి హోల్‌సేల్ ఫ్రూట్స్ అధినేత దుబ రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని యోగమిత్ర కె.డి.వి‌ఎన్ శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంద్రయాన్ ప్రాజెక్ట్ ఇస్రో శాస్త్రవేత్త అయినటువంటి రాజా శ్రీధర్ విచ్చేసారు. వంగిపురపు నవీన్, మూడేడ్ల శ్రీధర్, కూరెళ్ళ శ్యాంసుందర్ పాల్గొన్నారు.



ఉగ్రదాడి మృతులకు నివాళి



చల్లపల్లిలో...

ప్రజాశక్తి-మోపిదేవి (చల్లపల్లి) : పెహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ చల్లపల్లిలో అఖిలపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రధాన సెంటర్లో జరిగిన కార్యక్రమంలో పెహల్గాం ఉగ్రదాడిలో మతిచెందిన పర్యాటకులకు నివాళులు అర్పించారు, కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ముక్తకంఠంతో ఖండించారు. ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదం దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తంచేశారు. పర్యాటకుల మతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. ఈ కార్యక్రమం లో టీడీపీ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, ప్రజాసంఘాల నేత దాసి సీతారామరాజుల, ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ ఎంపీపీ పిట్టు వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, రైతుసంఘం రాష్ట్ర నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, పాల్గొన్నారు.

విశ్వ గెటెడ్ కమ్యూనిటీలో కొవ్వొత్తుల శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-గన్నవరం : పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా స్థానిక విఎన్. పురం రోడ్డులోని విశ్వ వెంచర్ కు చెందిన గేటెడ్ కమ్యూనిటీ సముదాయంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. సముదాయంలోని నివాసితులందరూ క్యాండిల్స్ వెలిగించి పహల్గాం మతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వ వెంచర్ ఎండీ గుర్రం అంజయ్య(నాని) మాట్లాడుతూ పహల్గాంలో ఉగ్రవాదులు దాడులు చేసి 28 మంది టూరిస్టును చంపడం దారుణమన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యను ప్రతిఒక్కరు ఖండించాలని కోరారు. ఇటువంటి సమయంలో దేశం అంతా ఒక్కతాటిపై నిలవాలని చెప్పారు. మతుల కుటుంబాలకు ప్రతిఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. గ్రేటెడ్ కమ్యూనిటీ పెద్దలు ఏవీవీఎస్ఎస్. రాజు, ముక్కామల ఉమామహేశ్వరరావు, రాధకష్ణ. డేగల చిన్నపులయ్య, ఏఎస్. రావు, మణివర్మరాజు, ఏ. భారతలక్ష్మి, పార్వతి, రజనీకుమారి, సత్యశ్రీ, వేణుగోపాల్, గోపిరావు, దుర్గారావు పాల్గొన్నారు.

బుద్ధవరంలో శాంతి ర్యాలీ : గన్నవరం మండలం బుద్ధవరం గ్రామంలో ఆదివారం రాత్రి పహల్గామ్ ఉగ్రవాదుల దాడికి నిరసనగా మతుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై, హిందూ ముస్లిం భాయి భాయి, ఉగ్రవాదం నశించాలి అంటూ నినాధాలు చేశారు. సర్పంచ్ బడుగు బాలమ్మ, కంభంపాటి లక్ష్మి, ముద్రబోయిన శ్రీను, గండికోట దసరద, నక్కా ఆదినారాయణ పాల్గొన్నారు.**ప్రజాశక్తి-అవనిగడ్డ :** కాశ్మీర్ లోని పెహల్గాం లో టెర్రరిస్టు ల కాల్పులలో మతి చెందిన వారికి వైసిపి యువ నేత బడే గౌతం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. మాజీ నీటి సంఘం అధ్యక్షులు వర్రీ బసవరావ్, అర్జ మల్లేశ్వరరావు, అద్దంకి శేషు, గల్లాజిత్తు రాజనాల తేజ, తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో...



అవనిగడ్డలో...



బస్టాండ్‌లో యువకులను ప్రశ్నిస్తున్న పోలీసులు

విస్తృతంగా లాడ్జిలు, హోటళ్లలో తనిఖీ

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజలకు భద్రత, తాము ఉన్నామనే భరోసా కల్పిస్తూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలలోని ముఖ్య ప్రదేశాల్లో పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఆయా పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌ఒలు వారి వారి సిబ్బందితో కలిసి రాత్రి గస్తీ నిర్వహించడంతో పాటు అన్ని లాడ్జిలను, హోటళ్లను తనిఖీ చేశారు. ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందిస్తూ తాము ఉన్నామన్న భరోసా కలిగి ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవనం సాగించాలనే ముఖ్య ఉద్దేశంతో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి రోజూ ముమ్మర గస్తీ నిర్వహిస్తున్నారు. అసాంఘిక కార్యకలపాలపై అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా నెంబర్ లేని వాహనాలు, మద్యం, గంజాయి మరియు ఇతర మత్తుపదార్ధాల అక్రమ రవాణా పై పటిష్టమైన నిఘా ఏర్పాటులో బాగంగా ముఖ్య ప్రదేశాలలో లా అండ్ ఆర్డర్ అధికారులు, సిబ్బంది ముమ్మరంగా వాహన తనిఖీలను నిర్వహించారు.



పెనుగంచిప్రోలులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పెనుగంచిప్రోలులో వాహన తనిఖీలు

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎస్ఐ అర్జున్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పెనుగంచిప్రోలు వచ్చే ప్రతి వాహనాన్ని అర్జున్ ఆధ్వర్యంలో సిబ్బంది పెనుగంచిప్రోలు పట్టణంలోకి వచ్చే ప్రతి వాహనం, తనిఖీ చేశారు. వచ్చే నెల 2న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజధానికి వస్తున్న నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లుగా తెలుస్తోంది.

కంచికచర్లలో

ప్రజాశక్తి - కంచికచర్ల : విజయవాడ సిపి ఇదేశాల మేరకు కంచికచర్ల పట్టణంలో ఇందిరా కాలనీలో ఆదివారం తెల్లవారు జామున పోలీసులు ముమ్మరంగా తనిఖీ చేశారు. నందిగామ రూరల్ సిఐ చవాన్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ల పరిధిలోని 8 మంది ఎస్ఐలు 70 మంది సిబ్బంది, డ్రోన్ సర్వే లైన్స్‌లో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి కుటుంబం సభ్యుల వివరాలు ఆధార్ కార్డుతో సహా వివరాలు సేకరించారు. తనిఖీలో భాగంగా 27 బైకులు, ఒక కారు, 3 ఆటోలను సరైన పత్రాలు లేవని సీజ్ చేసి కంచికచర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సిఐ చవాన్ తెలిపారు. ఇలాంటి ఆపరేషన్ నిర్వహించడం వల్ల అక్రమ కార్యకలాపాలకి కళ్లెం వేయచ్చని సిఐ తెలిపారు.



కార్డాన్ సెర్చ్‌లో పాల్గొన్న సిబ్బంది

ఎర్రమట్టి అక్రమ తరలింపు

ప్రజాశక్తి - వీరులపాడు : రాత్రి పగలు తేడా లేకుండా మూడు రోజుల నుంచి యథేచ్ఛగా ఎర్రమటిమట అక్రమంగా తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టి అవసరాన్ని బట్టి రూ.1,500 నుంచి రూ.2వేల వరకు అమ్ముతూ లక్షల్లో గడించే పనిలో అక్రమార్కులున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఇంత జరుగుతున్న అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వీరులపాడు మండలం అల్లూరు గ్రామ శివారులో ఉన్న తిమ్మాపురం చెరువు నుంచి ఎర్రమట్టి (గ్రావెల్) అక్రమంగా తరలిస్తూ అక్రమార్కులు లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. చెరువులో నిబంధనలకు విరుద్ధంగా భారీ గుంతలు ఏర్పాటు చేసి ఎర్రమట్టిని తరలించడం వల్ల వర్షాకాలంలో పాడి గేదెలు ఆ గుంటల్లో దిగి మృత్యువాత పడుతున్నాయని పశుపోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన మూడు రోజుల నుంచి విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నా ఇరిగేషన్ శాఖ అధికారులు కనీసం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు.



ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇరిగేషన్ ఎఇ టి.రాజేష్‌ను వివరణ కోరగా మట్టి తోలకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని అధికారుల అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తే అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన ఎ.కొండూరు మండలం కంభంపాడులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎ.కొండూరు మండలం కంభంపాడు గ్రామానికి చెందిన చిమట మురళీకృష్ణ (36) తన బైక్‌పై శనివారం సాయంత్రం కోడూరు రోడ్డులో ఉన్న మొక్కజొన్న తోటలోకి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా తిరుపతమ్మ చెరువు వద్ద గేదెలు అడ్డురావడంతో వాటిని తప్పించే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు బైక్ పై నుండి కిందపడి ప్రక్కనే ఉన్న తుమ్మ చెట్టు మొదలకు ఢీకొనటంతో తలకు బలమైన గాయాలై తీవ్ర



రక్తస్రావం కావటంతో రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందినట్లు ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపారు. మృతుడు ఎండోమెంట్ కంపెనీలో ఉద్యోగం నిర్వహిస్తూ ప్రతిరోజు బైక్‌పై డ్యూటీకి వెళ్లి వస్తుంటాడని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ఆదివారం ఉదయం శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భార్య, చిమట నాగ కళ్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు, మృతుడికి ఇద్దరు సంతానం ఉన్నట్లు ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపారు.

వేసవి తాపాన్ని తగ్గించేందుకు చలివేంద్రాలు: ఎంఎల్ఎ బొండా

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక 58వ డివిజన్ సింగ్‌నగర్ వడ్డెర కాలనీ మెయిన్ రోడ్డు వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎంఎల్ఎ బొండా ఉమామహేశ్వరరావు ఆదివారం ప్రారంభించి పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ వేసవికాలంలో ప్రజలకు ఎటువంటి అవాంఛిత సంఘటనలు జరగకుండా ప్రభుత్వం తరఫున అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పలు డివిజన్లో, జన సంచారం ఎక్కువగా ఉండే కూడలి సెంటర్లలో టిడిపి నాయకులు



వాహనదారులకు మజ్జిగ పంపిణీ కేంద్రాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, గుంజ గురుమూర్తి, ఒర్సు మస్తాన్, వేముల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం రఘురాం, మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని ముత్తవరపు వారి కల్యాణ మండపంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ గరిమెళ్ళ వెంకట శ్రీతేజ (ఎండి) వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య ఆరోగ్య శిబిరాన్ని నెట్టెం రఘురాం, వసంత నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడికి విచ్చేసిన వారితో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. విజయవాడకు చెందిన భవానీపురం భవానీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, విజయవాడ ట్రస్ట్ హాస్పిటల్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేసెమెంట్ సెంటర్, కానూరు ఇఎన్‌టి హాస్పిటల్, కానూరు, యలమంచి డయాబెటీస్ ఒరిజిన్ ఎండోక్రినాలజీ హాస్పిటల్, విజయవాడ, హెచ్‌సిజి కేన్సర్ సెంటర్, విజయవాడ, మాక్సివిజన్ కంటి హాస్పిటల్, విజయవాడ, గౌతమ్ న్యూరాలజీ హాస్పిటల్, భవానీపురం, గుత్తా శివాజీ స్కిన్ కేర్, విజయవాడ, అను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, విజయవాడ, అంకుర ఉమెన్, చైల్డ్ హాస్పిటల్ వారు ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఆయా ఆస్పత్రుల ప్రముఖ వైద్యులు



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, వైద్యులు

రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అన్ని విభాగాల సీనియర్ వైద్యులచే రక్తపరీక్షలు, హిమోగ్లోబిన్, స్కానింగ్, ఇసిజి, టు డి ఎకో, కేన్సర్ స్క్రీనింగ్, కంటి పరీక్షలు, ఇతరత్రా వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి వారికి తగు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్రా వాసు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి గూడపాటి పద్మశేఖర్, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కెవివి సత్యనారాయణ (విజయబాబు), టీడీపీ సీనియర్ నేత చెన్నుబోయిన చిట్టిబాబు, కొండపల్లి మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షులు చుట్టుకుదురు శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1998-2001 విద్యా సంవత్సర బిఎ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం తిరువూరులో జరిగింది. 24 సంవత్సరాల తరువాత కలుసుకున్న ఆ విద్యార్థుల్లో కొంతమంది ఒకరినొకరు గుర్తు పట్టలేక ఎంత మారిపోయారో అనుకుంటూ ఒకరినొరకరు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఏం చేస్తున్నది, ఎక్కడ ఉంటున్నది ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకున్నారు. అనాడు ఎకనామిక్స్ బోధించిన అధ్యాపకులు యరమల ప్రతాపరెడ్డిని, లైబ్రేరియన్ ఏనుగుల నరసింహారావును ఘనంగా సన్మానించారు. విందు అనంతరం వివిధ రకాల ఆటలలో ఉత్సాహంగా పాల్గొని ఈ కలయిక గుర్తుగా గిఫ్ట్ అందజేశారు. పూర్వ విద్యార్థులు కె.రంగా, సుదీప్తి, డి.విజయలక్ష్మి, బి.కృష్ణారావు ఈ కార్యక్రమం విజయవంతానికి కషి చేశారు.

నేటి నుంచి జూన్ 6 వరకు బాలల వేసవి శిబిరం

విజయవాడ : చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయం సత్యనారాయణపురంలో సోమవారం నుంచి జూన్ 5 వరకు చిన్మయి బాలల వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు ఆ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరగతులు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుండి 11 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, స్పోకెన్ ఇంగ్లీష్, జికె, సోషల్, భగవద్గీత శ్లోకాలు, తెలుగు, మ్యాథ్స్, యోగ, తదితర అంశాలపై తరగతులు, ఆటల పోటీలు నిర్వహించబడతాయన్నారు. పుస్తక పఠనం ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలు వంటివని, ప్రతి పుస్తకం వ్యక్తిని ఉన్నతుడిగా తీర్చి దిద్దుతుందని అన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలు తోపాటు ప్రతి రోజూ కొంత సమయం గ్రంథాలయంలో నచ్చిన పుస్తకం చదవాలని సూచించారు. విద్యార్థులు సత్యనారాయణపురం గ్రంథాలయంలో రేపటి నుండి నిర్వహించబోవు వేసవి విజ్ఞాన తరగతుల్లో కూడా పేరెంట్స్ సహకారంతో పాల్గొని విజ్ఞానం పొందాలని వారి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రిటైర్డ్ లెక్చరర్ బి.సావిత్రి, చిన్మయి బాలల వేసవి శిబిరాన్ని నిర్వహించే ఉపాధ్యాయులు పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయానికి విరాళం

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి అమ్మవారి ఆలయానికి ఉయ్యూరు మండలం గండికుంట గ్రామానికి చెందిన కగ్గ సాంబయ్య దంపతులు లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. ఆలయ ఎఇఒ తిరుమలేశ్వరరావుకు అందజేశారు. రూ.50 వేల నిత్యాన్నదానానికి, రూ.50 వేలు అంకమ్మ ఉపాలయం, గోపురం, వెండి తాపడానికి ఉపయోగించాలని కోరారు. సందర్భంగా ఆలయ అధికారులు శేష వస్త్రాలతో ప్రసాదాలతో దాతలను సత్కరించారు.



పురుషోత్తపట్నంలో

రోడ్డుపైనే మురుగునీరు

- డ్రైనేజీల్లో కదలని నీరు
- దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు



డ్రైనేజీల్లో కదలకుండా ఉన్న మురుగునీరు

ప్రజాశక్తి-గన్నవరం : పొంగుతున్న డ్రెయినేజి.. కదలని మురుగు.. వ్యర్థాలతో దుర్వాసన పీలుస్తూ ఎస్సీ కాలనీ వాసులు తీవ్రఇబ్బందులు పడుతున్న పరిస్థితి పురుషోత్తపట్నంలో ఉంది. మురుగుతో పిల్లలు, వద్ధులు ఆనారోగ్యానికి గురవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గత టీడీపీ హయాంలో మండలంలోని పురుషోత్తపట్నం దళిత వాడ వద్ద ప్రధాన రోడ్డుకు ఇరువైపుల డ్రెయినేజీని నిర్మించారు. అప్పటి నుంచి డ్రెయినేజీ నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. అక్కడక్కడ కొన్ని ఆక్రమణలు ఉన్నాయి. ఆక్రమణదారులు తమ ఇంటి ముందు నుంచి మురుగు ప్రవహించకుండా అడ్డుపడు తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రెయిన్లో ప్రవహించని మురుగు వెళ్లకపోవడంతో ఏమీ చేయలేకపోతున్నారు. సమస్యను పరిష్కరించమని అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని వాపోతున్నారు. గ్రామస్తులతో పాటు కొండపావులూరు, పైగ్రామాలకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు మురుగు చిమ్మి ఇళ్లల్లోకి, స్థానికులు మీద పడుతున్నాయి. ఎక్కడి కక్కడ మురుగు నిలిచి ఉండటంతో పచ్చగా మారి దుర్వాసన వస్తుంది. డ్రెయిన్లో పూడిక తీసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మురుగుతో ఇబ్బందులు ఎన్నాళ్లు..

టి.శ్రీనివాసరావు, గ్రామస్తుడు

ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయింది. దుర్వాసన భరించలేకపోతున్నాం. జ్వరం బారిన పడి పది రోజులు ఆస్పత్రిలో ఉండి రెండు నెల లు తరువాత ఇప్పుడే కోలు కుంటున్నాను. మురుగు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలి.

ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం

కె. సుబ్బారావు, గ్రామస్తుడు,

మురుగుతో ఆనారోగ్యం అగచాట్లు వుతున్నాం. చిన్నారులు, వద్ధు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ పూడుకుపోయింది. ఇంట్లో ఉండలేక పోతున్నాం. కొంత మంది గురించి మిగిలిన వారందరిని ఇబ్బందులకు గురిచేయటం సరికాదు.

దోమలు వద్ధి చెందుతున్నాయి..

రాము, గ్రామస్తుడు

మురుగుతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. పిల్లలను బయటకు పంపా లంటే మురుగులో పడిపోతారని తల్లిదండ్రులు భయాందోళన చెందు తున్నారు. దశాబ్ద కాలంగా ఉన్న మురుగు సమస్యను పరిష్కరించటంలో అధికా రులు విఫలమవుతున్నారు. అధికారులు సమన్వ యంతో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమస్య పరిష్కరించాలి. మార్తమ్మ,గ్రామస్తురాలు

డ్రెయినేజీ నిర్మించారని సంతోష పడాలో, ఎక్కడి మురుగు అక్కడ నిల్వ ఉంటుందని బాధ పడాలో అర్థం కావటం లేదు. ఏళ్ల తరబడి సమస్య ఉంటుంది. పరిష్కారానికి చర్యలు తీసుకోవటం లేదు. దోమలు వద్ధి చెంది దాడి చేస్తున్నాయి.

నూతన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎపిజిఇఎ)ఉయ్యూరు యూనిట్ నకు ఉయ్యూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. ఎలక్షన్ ఆఫీసర్‌గా గొల్లపూడి శ్రీనివాస్ , జిల్లా వైస్ ప్రెసిడెంట్, సహాయకులుగా సలీం, హుస్సేన్, జిల్లా జాయింట్ సెక్రెటరీల అధ్యక్షతన ఎన్నికల నిర్వహించారు నూతనంగా ఉయ్యూరు యూనిట్ ప్రెసిడెంట్ గా ఎస్ గణేష్ రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ పమిడిముక్కల సెక్రటరీగా బి విజయబాబు పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ ఉయ్యూరు ఆర్గనైజ్ సెక్రటరీగా ఏ శ్రీనివాస రావు, ఎస్ టిఓ ట్రెజరర్‌గా పి నాగేంద్రలను సీనియర్ అసిస్టెంట్ ట్రెజరీ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలక్షన్ ఆఫీసర్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.



మజ్జిగ అందిస్తున్న ఈవో కొండలరావు

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం సంధర్భంగా సుమారు 8 వేల పైగా యాత్రికులు దర్శించుకున్నారు. అత్యధిక స్థాయిలో భక్తులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చు కున్నారు. దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు మజ్జిగ, తాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహ ణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు పోలీసులు తగు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఇస్రో శాస్త్రవేత్త శ్రీధర్‌కు సత్కారం

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక సత్యనారా యణపురంలోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం మానవతా స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో చంద్ర యాన్ ప్రాజెక్టు ఇస్రో శాస్త్రవేత్త రాజా శ్రీధర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షులు అన్నపురెడ్డి గోపిరెడ్డి, ఉపాధ్యక్షులు దండమూడి సీతారామ స్వామి, జిల్లా మానవతాధ్యక్షురాలు దండుమూడి జయలక్ష్మి, మానవతా సభ్యులు దుడ్డు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రారెత్తిస్తున్న ఎండలు

రహదారులు నిర్మానుషం



ఎండలు పెరగడంలో గన్నవరంలోని జాతీయ రహదారిపై వాహనాలు, జనసంచారం లేని దృశ్యం

వైసిపి రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా జైగోపాల్



ప్రజాశక్తి-అవనిగడ్డ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా అవనిగడ్డకు చెందిన గాజుల జై గోపాల్ నియమితు లయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు పంపినట్లు జై గోపాల్ తెలిపారు. శనివారం రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ సమావేశం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జరగగా ప్రచార కార్యదర్శిగా తనను నియ మిస్తూ జగన్మోహన్ రెడ్డి నిర్ణయించి నందుకు జగన్మోహన్ రెడ్డితో పాటు నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు, కష్ణ గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనలించార్జ్ కడపలో నరసింహారావు, యువ నాయకులు వికాస్ బాబుకి జయ గోపాల్ ధన్యవాదాలు చెప్పారు.



బీచ్‌లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : వేసవికాలంలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండే మంగినపూడి బీచ్ నందు మెరైన్ పోలీసులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బీచ్ కీ వచ్చే సందర్శకుల భద్రతను దష్టిలో పెట్టుకొని ఎవరికీ ఎటువంటి ప్రాణహాని జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా కష్ణా జిల్లా, మెరైన్ పోలీస్ విభాగ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రమాద హెచ్చరిక బోర్డులు, సిబ్బందికీ లైఫ్ జాకెట్, లైఫ్ బోటు పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం ద్వారా సందర్శకులకు తెలియజేస్తూ ప్రత్యేక పహారా ఏర్పాటు చేసారు. గిలకలదిండి ఇన్స్పెక్టర్ కే.వంశీకృష్ణ, ఎస్ఐలు వి.జె.చంద్రబోస్, పరింకాయల మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు.

పులిగడ్డ సర్పంచ్ విజయ్‌కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డ గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ కు గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని హొసూరులో ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ ప్రధానోత్సవ కార్యక్రమం ఈనెల 26వ తేదీన ఓ హోటల్‌లో నిర్వహించగా అకాడమీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథుల చేతులు మీదుగా గౌరవ డాక్టరేట్ను సర్పంచి విజయ్ కుమార్ అందుకున్నారు. హాస్య ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ నిర్వాహకులకు ఈ సందర్భంగా విజయ్ కుమార్ కతజ్ఞతలు తెలిపారు. తన సేవలను గుర్తించి తనకు గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేయడం సంతోషంగా ఉందని విజయ్‌కుమార్ అన్నారు. ఫిబ్రవరి నెలలో హైదరాబాదులో సరస్వతి పరిషత్ విశ్వ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక మదర్ తెరిసా విశిష్ట సేవా జాతీయ పురస్కారం అందుకున్నారు. దాసరి విజయ్ కుమార్ సోషల్ సర్వీస్ విభాగంలో గౌరవ డాక్టరేట్ అందుకోవడం పట్ల పలువురు ప్రజా ప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ప్రముఖులు అధికారులు అభినందనలు తెలిపారు. విజయ్ కుమార్ భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉత్తమ అవార్డులు అందుకోవాలని గ్రామపంచాయతీ ప్రజలు ఆకాంక్ష వ్యక్తం చేశారు.



డాక్టరేట్ అందుకుంటున్న దాసరి విజయకుమార్



కోలాహలంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆదివారం (2004-2005నాటి బ్యాచ్) చిన్ననాటి స్మృతులను నెమరువేసుకుంటూ అద్వితీయ అనుభూతులను పంచుకునే పూర్వ విద్యార్థులకు సమ్మేళనం వేదికయ్యింది. 20 సంవత్సరాల తర్వాత కుటుంబాల పరిచయం ఓ అనుభూతి కలిగించిందని ముచ్చటిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. సభా సమయంలో గణిత గురువులు శ్రీలత, హిందీ ఉపాధ్యాయిని దుర్గా దేవి ఇరువురిని పట్టు వస్త్రాలతో విద్యార్థులు ఘనంగా సత్కరించారు. విద్యా సంస్థలకు తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ సమ్మేళనానికి హాజరైన2004-2005 వారందరినీ అభినందించారు. ఈ సందర్భంగా ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.పద్మలతను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.



20న సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు కార్మికులతో కలిసి సమ్మె బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. మే 20న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని ఉద్యోగ కార్మికులకు పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని చేస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. మండలంలో మేడే సందర్భంగా అన్ని గ్రామాల్లో కార్మిక ఉద్యోగులతో కలిసి ఎర్రజెండాలు ఎగరేయాలని ఎక్కువ మంది కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పుల్లారావు షేక్ సుభాని సిఐటియు నాయకులు లాల్ మొహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

చేనేత విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాసరావుకు అభినందన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విజయవాడలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఇటీవల వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా (చేనేత విభాగం) నియమితులైన పెంటి శ్రీనివాస రావును జిల్లా వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్ ఆదివారం శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో వైఎస్ఆర్ ప్రభుత్వం వచ్చేవరకు నిరంతరం మనందరం సమిష్టి



కృషితో జగనన్న ప్రభుత్వాన్ని ఏర్పడే వరకు ఆవిరాల కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

నిషేధం ఎత్తివేసి రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణంలోని శాంతినగర్, అశోక్ నగర్, సుగాలి కాలనీలోని వివిధ రకాల మాన్యం భూము(ఇళ్ల స్థలాలు)లకు విధించిన నిషేధాన్ని ఎత్తివేసి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని సిపిఎం తిరువూరు పట్టణ కమిటీ కార్యదర్శి మేకల నాగేంద్ర ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ పార్టీ పట్టణ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మాన్యం భూములపై చర్చించినట్లు ఆయన తెలిపారు. మన్యం భూముల నివేశ స్థలాలకు ఏప్పటి నుండో రిజిస్ట్రేషన్ అవుతుండగా సుమారు ఎనిమిది సంవత్సరాల నుండి ఈ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకురావడంతో ఈ స్థలాలను నమ్ముకొని జీవిస్తున్న మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాగేంద్రప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొంతమంది పిల్లల చదువులకు లేదా వివాహాలకు ఇల్లు అమ్ముకోవాలన్నా, బ్యాంక్ లోను పొందాలన్నా అవకాశం లేకుండా పోయిందన్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే నిషేధాన్ని ఎత్తివేసి రిజిస్ట్రేషన్‌కు అనుమతివ్వాలని నాగేంద్ర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో బాధితులతో కలిసి ఆందోళన ఉధృతంగా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

ఉద్యోగాల కల్పనకు ఉచిత శిక్షణ



గ్రామసభలో మాట్లాడుతున్న జెడిఎం సుమలత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : గ్రామాలు పరిపూర్ణ వికాసం చెందాలంటే పూర్తిస్థాయి ఉద్యోగ, ఉపాధి కల్పన గ్రామాల్లో ఉండాలని అవకాశాలు కల్పించటం జరుగుతుందని జెడిఎం (జాబ్స్ డిస్ట్రిక్ మేనేజర్) సుమలత అన్నారు. సమగ్ర గ్రామీణాభివృద్ధిపై శిక్షణ పొందిన విలేజ్ ఛాంపియన్స్, జిల్లా ఎన్ఐ ఆర్‌డి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ఎన్ఐఆర్‌డిజివి నరసింహారావు ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీడాప్ ద్వారా 18 నుంచి 35 సంవత్సరాలోపు గల గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించటం జరుగుతుందని ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ అప్ కోఆర్డినేటర్ రామ తులసి, వెలుగు ఎపిఎం వెంకటేశ్వర రావు, మండల సమైక్య అధ్యక్షులు గద్దె రాజలక్ష్మి, సిడాప్ జాబ్ కోఆర్డినేటర్స్ అశోక్, చందు, జగ్గయ్యపేట నియోజకవర్గ సిడాప్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జ్ రమేష్‌తో పాటు డ్వాక్రా సంఘాల మహిళలు, గ్రామ ప్రజలు, యువతీ యువకులు, పంచాయతీ ఛాంపియన్స్ పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో మండలంలోని పేర్ మొహమ్మద్ పేటలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులకు కోట కృష్ణ మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్లో ఉగ్రవాదులు కాల్పులు జరిపి పర్యాటకులను చంపడాన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. పర్యాటకులపై జరిగిన దాడిని అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దంతాల వెంకటేశ్వర్లు, దంతాల రాజేశ్వరి, కాకనబోయిన సుబ్బారావు, షేక్ మీరా సాహెబ్, ఎస్.రామనాథం, కోట రవికుమార్, దంతాల నరేంద్ర, షేక్ బడే మియా, గ్రామస్తులు షేక్ మస్తాన్, కె గోపి, గంజి జగన్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న దృశ్యం

మేడే జెండావిష్కరణలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మే ఒకటి మేడే వేడుకలు ఘనంగా నిర్వహించాలని, కార్మిక హక్కుల కోసం మే 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ సి. హెచ్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గొల్లపూడి రూరల్‌లో కార్మికులతో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దుకై కార్మికులు మరింత ఉధృతంగా పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలని, దీనికై మే 20న సమ్మె దేశవ్యాప్తంగా చేయబోతున్నట్లు కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు ఉధృతంగా నిర్వహించేందుకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు విజయవాడ రూరల్ మండలం తాళ్లూరు నరసింహారావు సిఐటియు గొల్లపూడి కార్యదర్శి చోడవరపు సుబ్బారావు, మండల ప్రెసిడెంట్ వడ్లమూడి శ్రీకాంత్. పాల్గొన్నారు.



ఉరేసుకుని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండలం పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన ఓవ యుడకుడు ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని సాయిదుర్గా లాడ్జిలో ఉరేసుకుని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు తన్నీరు రవికుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. చిరువ్యాపారం చేసుకుని జీవించే రవి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణ పరిధిలోని తొర్రగుంటపాలెంలో ఆదివారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు పెనుగంచిప్రోలుకు చెందిన వేల్పుల సంగీతరావు (35) ప్రైవేట్ బ్యాంక్‌లో పనిచేస్తూ తొర్రగుంటపాలెంలో నివాసం ఉంటున్నాడు. ఆర్థికపరమైన, కుటుంబ కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. భార్య ఫ్యాన్సీ, దుస్తులు దుకాణం నిర్వహిస్తోంది. ఇద్దరు పిల్లలున్నారు. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో సంఘటన జరగగా సంగీతరావును హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి శాంతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి 65వ నెంబర్ జాతీయ రహదారి పక్కన సానికులు యువకుని మృతదేహన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు తెలంగాణ రాష్ట్రం కోదాడ బంజర కాలనీకి చెందిన షేక్ నాగుల మీరా అలియాస్ ఫిరోజ్ (24)గా గుర్తించారు. తలపై బలమైన రాయితో కొట్టి చంపినట్టు తెలుస్తుంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కృష్ణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వేసవి తాపానికి అల్లాడుతున్న రహదారి బాటసారులకు బస్టాండ్ సెంటర్ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిన్నెల్లి పాండురంగారావు, పూర్వ అధ్యక్షులు పచ్చిపాల నాగేశ్వరావు, జాతీయ బీసీ సంఘం నాయకులు మధు, తుపాకులు పిచ్చయ్య, లక్ష్మీనారాయణ, చిలుకూరి హరికష్ణ, కొటూరు రామారావు, నర్రా సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



దద్దోజనం పంపిణీ

శ్రీ వాసవి సేవా సమితి జిల్లా అధ్వర్యంలో స్టీలుకొట్ల సెంటర్‌లో ఏర్పాటు చేసిన 100 రోజుల చలివేంద్రం వద్ద కీర్తిశేషులు సముద్రాల లక్ష్మీగోపాలం వర్ధంతి సందర్భంగా వారి కుమారులు కిరాణా వ్యాపారి సముద్రాల సుబ్రహ్మణ్యం సౌజన్యంతో ఆదివారం వాసవి సేవా సమితి ఏర్పాటు చేసిన 100 రోజుల చలివేంద్రం వద్ద దాత సముద్రాల సుబ్రహ్మణ్యం చేతుల మీదగా దద్దోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారులు పేరూరి నరసింహారావు, జిల్లా ట్రెజరర్ పెనుగొండ రామకష్ణ, పట్టణ ట్రెజరర్ స్వామి కృష్ణమూర్తి, జిల్లా యూత్ అధ్యక్షుడు చౌట రమేష్, సూరె రాము తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రయాణికులకు చల్లటి మజ్జిగ పంపిణీ అభినందనీయమని ప్రముఖ వాణిజ్య వేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ ప్రశంసించారు. ఆదివారం హౌసింగ్ బోర్డ్ కాలనీలో అప్నా బజార్ రోడ్‌లో వాసవి క్లబ్ భవానీపురం గోల్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారులు, గిరిజన గీత శిల్పి డాక్టర్ బొండా జగన్మోహన రావు తమ సామాజిక సేవలో భాగంగా ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చడం కోసం సేవా సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ చలివేంద్రంలో వెత్స రామారావు, పేరూరి సావిత్రి రామ్ ఆధ్వర్యంలో గత 20 రోజులుగా ప్రతినిత్యం 1500 మందికి మజ్జిగను అందజేస్తుండడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బొండా జగన్మోహన్ రావు, క్లబ్ ఆర్‌సి.సురేష్ కుమార్, నగర ప్రముఖులు గర్రె ప్రసాద్, అల్లం పూర్ణచంద్రరావు, ఆర్టిస్ట్ పి.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-మొవ్వ : కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ శాఖ మొవ్వ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఏప్రిల్ 28 నుండి జూన్ 6 వరకు, ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు 40 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు మొవ్వ గ్రంథాలయ అధికారి టి కష్ణకుమారి తెలిపారు. ఈ శిక్షణా తరగతులను పాఠశాల విద్యార్థులకు ప్రతిరోజు నీతి కథలు, చదువటం, వాయటం, స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, క్యారమ్స్, చెస్ మొదలగు వాటిని నేర్పిస్తామని, మొవ్వ పరిసర ప్రాంత విద్యార్థిని,విద్యార్థులు ఈ వేసవి విజ్ఞాన తరగతులకు వినియోగించుకోవాలని అన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డ లోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో సోమవారం నుండి జూన్ 6వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ కష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జే ప్రభుదాస్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థిని విద్యార్థులకు ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడుతుందని, సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు కథలు చదవడం కథలు చెప్పడం చిత్రలేఖనం పేపర్ క్రాఫ్ట్ స్పోకెన్ ఇంగ్లీష్ జీకే అధ్యాపకులచే విద్యార్థులకు నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి కోరారు .**ప్రజాశక్తి - గుడివాడ** : స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖ గ్రంథాలయంలో ఈనెల 28 నుండి జూన్ 6వ తేది వరకు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయ నిర్వాహకురాలు పి. శాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహ కురాలు కోరారు.**ప్రజాశక్తి-ఘంటసాల** : కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ గ్రంథా లయం ఘంటసాల, కొడాలి, శ్రీకాకుళం గ్రంథాలయాల్లో ఏప్రిల్ 28 వ తేదీ నుంచి జూన్ 6 తారీకు వరకు వేసవి విజ్ఞాన తరగతులను ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11గంటల వరకు నిర్వహి స్తున్నట్లు గ్రంథాలయ శాఖ అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారులు ఎం.శరత్ కుమార్, ఎం.సుబ్బారావు, డి. సుజాత విద్యార్థులను కోరారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - గుడివాడ : పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే విషయంలో గణేష్ హాస్పిటల్ ఎప్పుడు ముందుంటుందని యూరాలజిస్ట్ సర్జన్ డాక్టర్ యలవర్తి పవన్ గణేష్ తెలిపారు. గుడివాడ మండలం రామనపూడిలోని క్వాలిటీ ఫీడ్స్‌లో చుట్టుపక్కల ఉన్న ఐదు గ్రామాల ప్రజలకు, క్వాలిటీ ఫీడ్స్‌లో పనిచేస్తున్న 200 కుటుంబాలకు ఆదివారం ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ వైద్య శిబిరం ద్వారా సుమారు 10 రకాల ఉచిత వైద్య పరీక్షలతోపాటు ఈసిజీ, క్యాన్సర్ కణాల గుర్తింపు పరీక్షలు నిర్వహించామన్నారు.


డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎంఎల్‌ఎకు సమస్యలు తెలుపుతున్న స్థానికులు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ అభివద్ధికి నిరంతరం పనిచేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. 'మీకోసం మీ వెనిగండ్ల' ఉదయపు పర్యటనలో భాగంగా ఆదివారం స్థానిక ఏడో వార్డులో ఆయన పర్యటించారు. వార్డులోని కొత్తపేట పరిసర ప్రాంతాలకు ద్విచక్ర వాహనంపై వెళ్లిన ఎమ్మెల్యే రాము స్థానిక ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు తెలపడంతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఏడో వార్డు కూటమి పార్టీల నాయకులు కునుకు మోహన్, ఏడుకొం డలు, పెద్ది కిషోర్, మంగరాజు, స్థానిక ప్రజలు, యువత పాల్గొన్నారు.

అలాగే అనారోగ్యంతో ఇటీవల మరణించిన బీసీ సంఘ నాయకులు టిడిపి నేత దారం నరసింహారావు కుటుంబ సభ్యులను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పరామర్శించారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులోని దారం ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ముందుగా స్వర్గీయ దారం నరసింహారావు చిత్రపటానికి పూలమాలవేసి ఎమ్మెల్యే రాము నివాళులు అర్పించారు.

శిథిలావస్థలో వాటర్‌ట్యాంక్




ప్రజాశక్తి ఘంటసాల : ఘంట సాల మండలం ఎండకుదురు, జీలగలగండి కాలనీ గ్రామస్తులకు రక్షిత తాగునీటి అందించే ట్యాంక్ శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, స్పందిం చకపోవడం పట్ల సిపిఎం కష్ణాజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శీలం నారాయణరావు, ఘంటసాల మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు గ్రామానికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తూ నీటి సమస్య రాకుండా చూడాలని కోరారు.

ఇళ్లస్థలాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం హౌసింగ్ ఫర్ అల్ కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం ఉత్తరం మండలంలో అర్హత గల లబ్దిదారులకు గ్రామంలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తహసీల్దార్ బి నాగభూషణం తెలిపారు. కావున లబ్దిదారులు ఇంటి స్థలం మంజూరు కొరకు దరఖాస్తులు దాఖలు చేసుకోవాలన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : అర్హులైన వారికి ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోవాలని పమిడిముక్కల తహసీల్దార్ నవీన్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఉన్న అన్ని గ్రామాల్లో ఇంటి స్థలం లేని పేదలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులకు మూడు సెంట్లు మంజూరు చేస్తామని, రేషన్ కార్డు ఉన్నవారు ఆధార్ కార్డు తీసుకున్న సచివాయాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

సింగలూరులో గుడివాడ సైక్లింగ్ క్లబ్ బృందం పర్యటన



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడివాడ పట్టణ ప్రముఖ యువవైద్యులు, వివిధ రంగాల యువతతో కూడిన "గుడివాడ సైక్లింగ్ క్లబ్" బృందం గుడ్లవల్లేరు మండలం సింగలూరు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న అభివద్ధి పనులను ప్రశంసిం చారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ అధ్యక్షులు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ సింగలూరు గ్రామంలో మౌళిక సదుపాయాలు కల్పించటం, గ్రామస్థులు దురలవాట్లకు దూరంగా ఉండటం, మహిళా సాధికారత, బాలికల విద్య, ఆరోగ్యం, ఆధ్యాత్మికతతో కూడిన సమగ్ర గ్రామాభివద్ధిలో డాక్టర్ బండారు శ్యామ్ కుమార్ రెండు దశాబ్దాల కషి అభినందనీయమన్నారు. డాక్టర్ పొట్లూరి వంశీకష్ణ మాట్లాడుతూ సింగలూరు గ్రామం ప్రగతి పథంలో రూపాంతరం చెందటంలో డాక్టర్ బండారు శ్యామ్ కుమార్, సరస్వతి దంపతుల కషి, గ్రామస్తుల, ప్రభుత్వ సహకారం ఆదర్శనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉండవల్లి సురేష్ బాబు, డాక్టర్ అనురాధ, డాక్టర్ పిన్నమనేని రామకష్ణ ప్రసాద్, డాక్టర్ సూరజ్, డాక్టర్ సూర్య శరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మొవ్వ మండలంలో...



గుడ్లవల్లేరు మండలంలో..

ప్రజాశక్తి-మొవ్వ : మండల కేంద్రమైన మొవ్వలో శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 2001,2002 సంవత్సరంలలో చదివిన 70 మంది విద్యార్థిని విద్యార్థులు వారిని ఎంతో క్రమశిక్షణతో తీర్చి దిద్దిన ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ శ్రీదేవి, గొరిపర్తి శ్రీ వెంకటశేషగిరి (ఉయ్యూరు ఎంపిడిఓ), జడ్పి కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, పూర్వ ప్రధానోపాధ్యాయులు కె సుబ్బరాజు, మోహన్‌దాస్ , కె ఆర్ కె శర్మ , టి మారుతీ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక ఎస్‌సిఆర్ఎం హైస్కూల్‌లో 2005-2006 సంవత్సర 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని పశువుల సంత ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు సుధాకర్, అరుణ, సుబ్రహ్మణ్యంలను సన్మానించి వారికి జ్ఞాపకను అందజేశారు. దాదాపు 20 సంవత్సరాల తరువాత ఓలాంటి కలయిక చాలా ఆనందకరంగా ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. అనంతరం విద్యాభ్యాసం చేసే రోజుల్లో వారి వారి అనుభవాలను ఒకరివి ఒకరు పంచుకొంటూ ఆనంద తీరంలో మునిగితేలారు.



విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాదు

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు సన్మానం

ప్రజాశక్తి-అవనిగడ్డ : విద్యార్థులు ఉన్నత విద్యావంతులు అవ్వడం ద్వారా మంచి అభివద్ధి సాధించగలుగుతారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. శనివారం సాయంత్రం అవనిగడ్డలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులు నంబూరి దీపిక 600 మార్కులకు 595 మార్కులు, చెన్నగిరి చరిత 577, చెన్నగిరి యామిని 576 మార్కులు సాధించడంతో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అవనిగడ్డ విభాగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మండలి బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో మహాసభ అవనిగడ్డ విభాగం అధ్యక్షులు కొల్లిపర రాధాకష్ణ, ఉపాధ్యక్షులు విశ్వంశెట్టి శ్రీనివాస్, ఆ సంఘం నాయకులు బెజవాడ ధన సురేష్ తదితరులు పాల్గొన్నారు



ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-ఘంటసాల : పేద ప్రజలకు సేవ చేసేందుకు ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఫాస్టర్ పిఎన్.రాజు తెలిపారు. పర్ణశాల ప్రార్థనా మందిరము ఘంటసాల వారి ఆధ్వర్యంలో ఘంటసాలపాలెం గ్రామంలోని చిన్న హరిజనవాడలో ఆదివారం జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మచిలీపట్నంకు చెందిన వైద్యులు డాక్టర్ యక్కటి ప్రవళిక బీపీ, షుగర్, జలుబు, దగ్గు, ఆస్తమా, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి, దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు జరిపారు. సుమారు 103 మంది రోగులకు పర్ణశాల ప్రార్థనా మందిరము ఆధ్వర్యంలో రూ.22 వేల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. ఫాస్టర్ పిఎన్.రాజు, వెంకటరత్నం, చక్రధర్, ప్రశాంత్, అహ్మద్, కిరణ్‌తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గుడివాడ : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో ఆదివారం పూర్వాధ్యక్షులు రవీంద్రనాథ్ ఇంటి వద్ద గతంలో టైరుకు పంక్చర్ వేస్తూ తీవ్రంగా గాయపడిన శంకర్ అనే బాలునికి ఏడు వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని అందించారు. క్లబ్ సభ్యులు అధ్యక్షులు నల్లూరి శేషగిరిరావు, సెక్రెటరీ అన్నే నవీన్, వై. రవీంద్రనాథ్, విజయ భాస్కర్, ఆర్. వేణుబాబు, కె.వి. రమణ, ఎం. వీరశేఖర్‌ల సహకారంతో దీనిని అందించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రవికుమార్, సభ్యులు కష్ణారాజు, దుర్గా కాంత్ తదితరులు హాజరయ్యారు.





ఉత్సాహంగా చెస్ పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పోరంకిలోని విజ్ఞాన భారతి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరిగిన కృష్ణాజిల్లా అండర్ - 13 బాల బాలికల చెస్ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. అండర్ -13 చెస్ పోటీలతో పాటు ఓపెన్ కేటగిరిలో కూడా చెస్ పోటీలను నిర్వహించినట్లు చెస్ అసోసియేషన్ సెక్రటనీ ఎన్ఎం ఫణికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు విజ్ఞాన భారతి హై స్కూల్ డైరెక్టర్ కె.ఆర్.ఎస్.రావు, ప్రముఖ ఫిట్‌నెస్ డెవలపర్ జి.వేణు, కరూర్ వైశ్యా బ్యాంకు మేనేజర్ కె.శ్రీనివాస్, ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు పి.రేణుక, కె.ఆనంద్ విజేతలకు బహుమతులను అందచేశారు. ఈసందర్భంగా విజేతల వివరాలను నిర్వాహకులు తెలియచేశారు.

అండర్ -13 బాలుర విభాగంలో కె.హర్షిత్ సాయి, ఎస్.కె. అబ్దుల్ ఫెయిజ్ వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో ఎం.నాగ శుభశ్రీ, ఎస్. ప్రహస్థ మొదటి రెండు స్థానాలు సాధించారు.

ఓపెన్ టోర్నమెంట్‌లో మొత్తం 10 మంది క్రీడాకారుల పాల్గొనగా ఐదు రౌండ్లుగా పోటీలను నిర్వహించారు. వీరిలో మొదటి ముగ్గురికి ప్రత్యేక బహుమతులను అందచేసినట్లు టోర్నమెంట్ నిర్వాహకులు ఫణికుమార్ తెలిపారు. కె.సందీప్, వి.మోనిష్, బి.రుషీల్ సాయిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.



నాణ్యమైన సరుకులు అందించాలి

ప్రజాశక్తి - విజయవాడ : తక్కువ ధరలకు నాణ్యమైన వస్తువులను ప్రజలకు అందజేయడం విజయ్ కృష్ణ సూపర్ బజార్ ప్రత్యేకత అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సింగ్‌నగర్ టిడిపి కార్యాలయంలో నూతనంగా బందర్ రోడ్డులోని విజయ్ కృష్ణ సూపర్ బజార్ నూతన కమిటీకి ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గం శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ విజయ్ కృష్ణ సూపర్ బజార్‌లో వినియోగదారులకు అవసరమైన డ్రైఫ్రూట్స్, విద్యార్థులకు పుస్తకాలు, దీపావళి పండుగ పర్వదినాలలో టపాసులు, విద్యా సంవత్సర ప్రారంభంలో నోట్ బుక్స్ ప్రైవేట్ మార్కెట్ కన్నా తక్కువ ధరలకు నాణ్యమైన వస్తువులను ప్రజలకు అందజేయడంలో విజయ్ కృష్ణ సూపర్ బజార్ ప్రత్యేకమైనదని అన్నారు. విజయ్ కృష్ణ సూపర్ బజార్ నూతన కమిటీ ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కృష్ణ సూపర్ బజార్ నూతన కమిటీ ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపింది. కమిటీ చైర్మన్ వెలగా సురేష్, డైరెక్టర్లు పడమటి రామకృష్ణ, వేల్పుల రాజేష్, కడియం శివ ప్రకాష్, బేవర సూరి, దొంగ రాంజనేయులు, మోతుకూరి ఖాసిమ్‌కు బొండా ఉమా సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, మాజీ ఎఎంసి డైరెక్టర్ ఘంటా కృష్ణమోహన్, క్లస్టర్ దాసరి కనకారావు తదితరులు పాల్గొన్నారు.

రాజా ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో

అబాకస్, వేదగణితం పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అబాకస్, వేద గణితం చిన్నారుల్లో గణితం పట్ల ఆసక్తిని, విశ్లేషణాత్మకతను పెంపొందిస్తుందని ఇస్రో రీసెర్చ్ సైంటిస్ట్ పి.ఏడుకొండలు తెలిపారు. డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, న్యూరల్ నెట్వర్క్, రోబోటిక్స్‌లో వేద గణితం ప్రముఖ పాత్ర పోషిస్తుందని అన్నారు. విజయవాడలోని పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో రాజా ఎడ్యుకేషనల్ అకాడమీ వారి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అబాకస్, వేద గణిత పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలకు 14 రాష్ట్రాలకు చెందిన 1235 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అబాకస్ -16 , వేదగణితం - 4, రూబిక్స్ - 2, విభాగాల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు, ప్రశంస పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా కాలేజీ కరెస్పాండెంట్ డాక్టర్ చిట్టా అమర్ సుధీర్ మాట్లాడుతూ కృత్రిమ మేధాశక్తిలో వేదగణితం ప్రాముఖ్యత ఎంతో ఉందని అన్నారు. అతి తక్కువ సమయంలో విద్యార్థులు సమస్యలను శ్రద్ధతోను, ఖచ్చితత్వంతోనూ సమర్ధవంతంగా పరిష్కరిస్తున్న విధానం అబ్బురపరిచిందన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణ కుమార్ మాట్లాడుతూ వేద గణితం గణనలను సులభతరం చేస్తుందని, వాటిని త్వరగా చేయడంలో సహాయపడుతుందని అన్నారు. రాజా ఎడ్యుకేషనల్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ మార్టూరి పద్మలత మాట్లాడుతూ వేదగణితాన్ని మానసిక గణితం అని కూడా అంటారన్నారు. అబాకస్ పిల్లల మనస్సులోని భయాందోళనలను సులువుగా తొలగిస్తుందని, పోటీతత్వాన్ని కూడా పెంపోందిస్తుందని తెలిపారు. మెదడు సామర్థ్యం ఐదు రెట్లు పెంచడంలో రూబిక్స్ దోహదపడుతుందన్నారు.



విజేతలకు బహుమతులిస్తున్న దృశ్యం

నగరంలో యాంటీ నార్కోటిక్ బృందాలు తనిఖీ

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షణ చర్యల్లో భాగంగా సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురిచేసే వారిని గుర్తించే దిశగా ప్రజలకు మేమున్నామనే భరోసా ఇచ్చేందుకు పోలీసు కమిషనరేట్ పరిధిలో యాంటీ నార్కోటిక్, ఈగల్ టీంలు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక బృందాల వారు విజయవాడ నగరంలోని వివిధ ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీ నిర్వహించి చట్ట వ్యతిరేకంగా మద్యం, గంజాయి, ఇతర వస్తువులను రవాణా నియంత్రించడం, అనుమానిత ప్రదేశాలపై నిఘా పటిష్టం చేయడంతో పాటు విరివిగా ఆయా ప్రదేశాలను తనిఖీ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిని అదుపులోకి తీసుకోవడంతో వారికి మత్తు పదార్థాలను సేవించడం వల్ల కలిగే అనార్థాల గురించి అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలను ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలపై స్కూల్స్, కళాశాలల, పబ్లిక్ ప్రదేశాల్లో యువతకు పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్ ద్వారా అనుమానితులను తనిఖీ చేస్తున్నారు. యాంటీ నార్కోటిక్, ఈగల్ టీం బృందాల వారు నగరంలోని వివిధ ప్రదేశాల్లో తనిఖీలను నిర్వహించి 50 మంది అనుమానిత వ్యక్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఓపెన్ ప్రదేశాల్లో మద్యం సేవించిన 20 మందిని అదుపులోనికి తీసుకుని తగు చర్య నిమిత్తం వారిని సంబంధిత పోలీసు స్టేషన్ వారికి అప్పగించారు. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్ ద్వారా 20 అనుమానితులను తనిఖీ చేయగా పాత కేసుల్లో నిందితుడైన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో అప్పగించారు.



వాహనదారులను తనిఖీ చేస్తున్న పోలీసులు

విస్తృతంగా రోటరీ క్లబ్ మిడ్‌టౌన్ సేవలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని లేమాన్ ట్రీ హోటల్‌లో సభ్యుల సమావేశం జరిగింది. అనంతరం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం కైలాస వైకుంఠ వాహనాన్ని ప్రారంభించారు. జిల్లా గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు ఈ సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికార పర్యటనలో భాగంగా పలు సేవ కార్యక్రమాలు ప్రారంభించామని చెప్పారు. పుట్టడాన్ని ఎంత ఆనందంగా జరుపుకుంటామో అంతిమయాత్ర కూడా ఎటువంటి ఇబ్బందులు పడకుండా జరుపుకోవాలని అనుకుంటారని అందుకోసం రోటరీ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో వాహనాన్ని ప్రారంభించామని తెలిపారు. రోటరీ క్లబ్ అనేక సేవ కార్యక్రమాలు చేస్తుందని గర్భాశయ కేన్సర్‌ను నివారించడానికి గర్భాశయ కేన్సర్ వ్యాక్సిన్ వేస్తున్నామని చెప్పారు. పేదలు ఆర్థికంగా ఎదిగేందుకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్నామని వివరించారు. అనంతరం అధ్యక్షులు గుడిపాటి కిషోర్ మాట్లాడుతూ తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రక్కన ఉన్న వీరబాబు దేవస్థానానికి రోటరి మిడ్ టౌన్ ఆధ్వర్యంలో రెండు లక్షల రూపాయల మేర విలువ చేసే వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అంతిమ యాత్ర కోసం కైలాస వైకుంఠ వాహనాన్ని ఏర్పాటు చేశామని చార్టెడ్ అకౌంట్ గడ్డం రవి, వారి తండ్రి గడ్డం సుబ్బారావు జ్ఞాపకార్థం కొంత సొమ్మును, అలాగే క్లబ్ ఆధ్వర్యంలో కొంతసొమ్మును కలిపి వాహనం కొనుగోలు చేశామని చెప్పారు. దాతల సహకారంతో విజయవాడలోని పేదలకు అతితక్కువ ధరకే వాహనం అందిస్తామని అవసరమైతే ఉచితంగా ఇచ్చే ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అనంతరం విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గడ్డం రవికుమార్ మాట్లాడుతూ రోటరీ విజయవాడ క్లబ్ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో కైలాస వైకుంఠ వాహనాన్ని ప్రారంభించుకోవడం దానికి తాను దాత కావడం సంతోషంగా ఉందన్నారు.. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సుందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, డిస్ట్రిక్ అడ్వైజర్ యడ్ల పార్థ సారథి,క్లబ్ ప్రతినిధులు మధు కోనేరు, తొండేపు ఉదయ్, నండూరి త్రినాథ్, కరం వీర్ కౌర్, మద్దినేని శ్రీనివాస్, పి.శివశంకర్ తదిరులు పాల్గొన్నారు.



నేడు అన్ ఎయిడెడ్ స్కూల్స్ అసోసియేషన్ సమావేశం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఫెడరేషన్ ఆఫ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 28న మధ్యాహ్నం 3 గంటలకు మొగల్‌రాజ పురంలోని శ్రీ శ్రీనివాస గ్రావిటీ కళాశాలలో అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు ఎపి ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 35.40 లక్షల మంది విద్యార్థులు ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలు ఇబ్బందికరంగా ఉన్నాయని, ప్రయివేటు మేనేజ్‌మెంట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫెడరేషన్ ఆధ్వర్యంలోని వివిధ విద్యా సంస్థల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ సభ్యులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 17వేల విద్యా సంస్థలకు చెందిన సభ్యులు, ఈ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్‌లోని ఆయా పోలీసు స్టేషన్ల పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో రౌడీషీటర్‌లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్‌లకు చెడునడత కలిగిన వ్యక్తులకు కౌన్సిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని అన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రామాల్లో పాల్గొనకూడదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని అన్నారు. ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

నేడు భూములు కౌలు వేలం

ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి మండలంలో భీమవరం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న 19 ఎకరాల 30 సెంట్లు వ్యవసాయ భూములకు కౌలు వేలంపాట నిర్వహిస్తున్నట్లు వేదాద్రి యోగానంద లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం ఆలయ అధికారి కానూరు సురేష్ బాబు తెలిపారు. భీమవరంలోని రాజగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం 11 గంటలకు నిర్వహించే కౌలు వేలంలో ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు. సంవత్సర కాలానికి వేలంపాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేవాదాయ శాఖకు బకాయిలున్నవారు ఈ వేలంపాటలో పాల్గొనేందుకు అనర్హులని ఇఒ స్పష్టం చేశారు.